క్లుప్తంగా

సురక్షిత ప్రసవాలే లక్ష్యం



గర్భిణికి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: మాతా,శిశు మరణాలను తగ్గించేలా, సురక్షిత ప్రసవాలే లక్ష్యంగా సేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీలో పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ క్రమం తప్పకుండా గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు రక్తహీనతను నివారించవచ్చన్నారు. కాన్పు చేయించుకున్న వారికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి దగ్గర ముర్రుపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణవతి, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: మారుమూల ప్రాంతంలోని నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని పాలకల-2లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 91 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: ఐరాల మండలంలో మంగళవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐలవారిపల్లెలో సారా విక్రయిస్తున్న హేమచంద్రబాబు(57)ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 80 ప్యాకెట్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపారు. దాడుల్లో సిబ్బంది క్రిష్ణయ్య, సుబ్రమణ్యం గౌడు, నాగరాజు, వెంకటేశు, మమత, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చిరుత వీడియో నకిలీ

• డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి స్పష్టం

చిత్తూరు కార్పొరేషన్: తవణంపల్లె మండలంలో చిరుత సంచారం అని వస్తోన్న వీడియో నకిలీదని డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి మంగళవారం స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోన్న వీడియో స్థానికంగా తీసింది కాదని, దీనిపై గ్రామస్తులు ఆందోళన చెందవద్దన్నారు. ఎఫ్‌ఆర్వో బాలకృష్ణారెడ్డి బృందం క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పరిశీలిస్తున్నారన్నారు. ఇంతవరకు ఎటువంటి పులి అడుగుల జాడ కనపడలేదని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 గుణశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రస్తుత పోటీ యుగంలో విద్యార్థులు ముందుకు దూసుకుపోవాలంటే మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జీడీ నెల్లూరు ఎంఈఓ-2 గుణశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలో కొంగారెడ్డిపల్లెలో ఓ కళ్యాణ మండపంలో విజయం సీబీఎస్‌ఈ పాఠశాల 4వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ-2 మాట్లాడారు. తల్లిదండ్రులు, టీచర్ల మార్గదర్శనంలో ఉజ్వల భవిత దిశగా విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని సాగాలన్నారు. విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజ మాట్లాడారు. విద్యార్థుల్లో నిబిడీకృతమైన నైపుణ్యాలను వెలికితీసి, వాటికి సానపెట్టాల్సింది గురువేనన్నారు. అనంతరం పలు పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేద్దాం

• పలుచోట్ల అవగాహన ర్యాలీలు



చిత్తూరు అర్బన్: ర్యాలీ ప్రారంభిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: వార్డు స్థాయిలో విజయవంతంగా ముగిసిన 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో గెలుపొందిన వారికి మండల, మున్సిపల్ స్థాయి పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు నగర కమిషనర్ జె.అరుణ అన్నారు.ఈ పోటీలకు సంబంధించి మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి ర్యాలీని చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, సుధాకర్ రెడ్డితో కలిసి కమిషనర్ జెండా ఊపి ప్రారంభించి ఆమె మాట్లాడారు. వార్డు స్థాయిలో పోటీలు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారని, అదే స్ఫూర్తితో మున్సిపల్, మండల స్థాయి పోటీలను విజయవంతం చేయాలన్నారు. క్రీడల నిర్వహణకు సంబంధించి మైదానాలను సిద్ధం చేశామన్నారు. ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, ఎంఈఓ-2 మోహన్, పీడీలు, మహిళలు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్రా క్రీడలపై మంగళవారం ఎంపీడీఓ గౌరి ఆధ్వర్యంలో పురవీధుల్లో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బుధవారం నుంచి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి జాన్‌విక్టర్, తహసీల్దార్ విజయభాస్కర్, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, సర్పంచ్ మాసిలామని, అధికారులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: మండల స్థాయిలో బుధవారం నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. క్రీడా పోటీలను విజయవంతం చేయాలంటూ మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యలయం నుంచి బజారు వీధి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా సాగేందుకు అంతా సహకరించాలన్నారు. గ్రామ స్థాయిలో గెలుపొందిన జట్టుకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాణిపాకం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మండలస్థాయిలో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని తవణంపల్లె, అరగొండ, తొడతర, పట్నం సచివాలయాల్లో క్రీడాకారులు ఆటలు ఆడడానికి గ్రౌండ్ సిద్ధం చేసినట్లు వివరించారు. క్రీడాకారులు ఉదయం 7 గంటలకు మైదానానికి చేరుకోవాలని సూచించారు. క్రీడాకారులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభ చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పూతలపట్టులో..



ఐరాల..ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓలు



తవణంపల్లెలో..

కార్మికులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

• జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కరుణ కుమార్

చిత్తూరు రూరల్: అసంఘటిత రంగ కార్మికులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణ కుమార్ అన్నారు. చిత్తూరు జిల్లా కోర్టు న్యాయ సదన్ భవనంలో మంగళవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా కార్మిక శాఖ అసంఘటిత రంగ కార్మికులకు అవగాహన సదస్సు, ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదు కార్యక్రమం సంయుక్తంగా నిర్వహించాయి. జడ్జి మాట్లాడుతూ,అసంఘటిత రంగ కార్మికులకు కార్మిక చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వారికి సంక్షేమానికి ఉన్న చట్టాలను వివరించారు. ఒకవేళ కార్మికులకు అన్యాయం జరిగినా, వృత్తి రీత్యా ప్రమాదాలు సంభవించినా కార్మిక సంక్షేమ బోర్డు ఉండగా ఉంటుందన్నారు. లేబర్ కార్డులకు 18 నుంచి 59 ఏళ్ల లోపు భవన, ఇతర నిర్మాణ కార్మికులు అర్హులన్నారు.

లైంగిక వేధింపుల నివారణకు చర్యలు

అలాగే జిల్లా కోర్టు న్యాయ సదన్ భవనంలో మీడియాతో జడ్జి ఐ.కరుణ కుమార్ మాట్లాడారు. మహిళలపై లైంగిక వేధింపులు నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసేలా చూడాలన్నారు. పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపులకు గురైతే బాధిత మహిళలు ఐసీసీ, ఎల్‌సీసీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే, బాల కార్మికుల రహిత జిల్లాగా చిత్తూరును తీర్చిదిద్దడానికి సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈనెల11వ తేదీ వరకు జిల్లాలో సంబంధిత శాఖ అధికారులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

'ప్రజా సంకల్పయాత్ర' ఐదేళ్ల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

చిత్తూరు రూరల్: ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే వందశాతం నెరవేర్చారని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. 'ప్రజా సంకల్ప యాత్ర' నిర్వహించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెలోని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి కార్యాలయంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సంకల్పమే ధ్యేయంగా గత ప్రభుత్వ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారని, ఈ యాత్రలో జగన్‌మోహన్‌రెడ్డికి జనం అడుగడుగునా నీరాజనం పట్టారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే సీఎంగా ఆయన సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలిచారన్నారు. మళ్లీ రాష్ట్రంలో సంక్షేమ పాలన రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచులు కేపీ శ్రీధర్, శ్రీకాంత్, మధు, శివ, అమర్‌నాథ్‌రెడ్డి, త్యాగరాజులు, భాస్కర్, వేలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే ఆరణి



చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లెలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు జగన్, అన్న కుమారుడు శివ ఉన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ వాణి, వాసవి క్లబ్ వనిత అధ్యక్షురాలు లీలాకుమారి, కార్యదర్శి లలిత, ట్రెజరర్ కుసుమ, సభ్యులు పాల్గొన్నారు.

జన్ భాగీదారిలో భాగస్వాములు కండి

• కమిషనర్ అరుణ



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జన్ భాగీదారి' కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు భాగస్వామ్యులు కావాలని నగర కమిషనర్ జె.అరుణ పిలుపునిచ్చారు. జన్ భాగీదారి కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న 'సామాజిక సమతా సంకల్ప యాత్ర' కార్యక్రమాల నిర్వహణ, సంఘాల భాగస్వామ్యంపై మంగళవారం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11వ తేదీ వరకు వార్డు సచివాలయ స్థాయిలో అంబేడ్కర్ చిత్రపటాలు, జిల్లాస్థాయిలో విగ్రహాలకు పూలమాల వేయడం, సంతకాల సేకరణ, మారథాన్, ఇతర కార్యక్రమాలను, అలాగే 11న నగరంలో మూడు ప్రాంతాల్లోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం కోరారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.బాబు, ఎ.దేవరాజులు, సి.ఎల్లప్ప, ఎం.డేవిడ్, వి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యదర్శులతో సమీక్ష

వార్డు సచివాలయం స్థాయిలో నిర్వహించాల్సిన పలు కార్యక్రమాలపై నగర కమిషనర్ అరుణ మంగళవారం వార్డు కార్యదర్శులు, సీవోలు, ఆర్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌తో వివిధ అంశాలపై సమీక్షించారు. జన్ భాగీదారి కార్యక్రమాలను వార్డు సచివాలయ స్థాయిలో పక్కాగా నిర్వహించాలన్నారు. బుధవారం 43, 12వ వార్డు సచివాలయాల్లో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాలకు హాజరయ్యే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. నగరపాలక పరిధిలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న 'ఆడుదాం ఆంధ్ర' మున్సిపల్, మండల స్థాయి పోటీలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సీఎంఎం గోపి పాల్గొన్నారు.

రేషన్‌ను సద్వినియోగం చేసుకోండి



సరుకులను పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

పూతలపట్టు: రేషన్ సరుకులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. మంగళవారం వేపనపల్లె పంచాయతీలోని గోపాల కృష్ణపురంలో మొబైల్ వ్యాన్ ద్వారా రేషన్ సరుకుల పంపిణీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యంతో పాటు సరుకులు మండల కేంద్రానికి చేరిన 15 రోజుల్లోపు ప్రజలకు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క రేషన్‌కార్డుదారుడు కూడా తనకు సరుకులు అందలేదని ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయభాస్కర్, డీటీ మహేశ్వరి తదితరులు ఉన్నారు.

వినాయకుడి సేవలో పలువురు ప్రముఖులు





రాష్ట్ర వ్యవసాయ మండలి సలహాదారు తిరుపాల్ రెడ్డికి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు స్వామివారి చిత్రపటాలు, తీర్థప్రసాదాలను అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మండలి సలహాదారులు తిరుపాల్ రెడ్డి, హైదరాబాద్ పోలీసు కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. మంగళవారం వారు స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు రమేష్, విగ్నేష్, చిత్తూరు వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి

తవణంపల్లె: మామిడి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అరగొండ ఈశ్వరుడి గుడిలోని గౌరిశంకర్ కల్యాణ మండపంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడిలో పూత, పిందె సమయంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్, జూలై మాసాల్లో కొమ్మలు కత్తిరించాలన్నారు. ఏరువాక శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సకాలంలో మామిడి చెట్లకు విడతల వారీగా మందులు పిచికారీ చేస్తే మంచి దిగుబడి సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం ఉద్యానశాఖ అధికారి సాగరిక, ఏఓ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం



తవణంపల్లె: పట్నంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: కార్పొరేట్ స్థాయిలో పేదలకు వైద్యం అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మంగళవారం మండలంలోని కె.పట్నం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ మోహన్ వేలు, ఆర్థోపెడిక్ వైద్యాధికారి డాక్టర్ అఖిల్, గైనకాలజిస్టు డాక్టర్ షర్మిద రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 384 మందికి పరీక్షలు చేయించారు. కళ్లద్దాలకు 39 మందికి రెఫర్ చేశారు. శిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ప్రదర్శించారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు హరిరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును అధికారులు ఏర్పాటు చేశారు. శిబిరంలో సర్పంచ్ మాసిలామణి మాట్లాడారు. శిబిరంలో 268 మంది రోగులు పరీక్షించుకున్నారు. రోగులకు ఉచితంగా మందులను సరఫరా చేశారు. వైద్యాధికారి ప్రవీణ, సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

బంగారుపాళెం: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. మండలంలోని తిమ్మోజుపల్లెలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరంలో 251 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. బొమ్మాయిపల్లె సర్పంచ్ గౌరమ్మ, తిమ్మోజుపల్లె ఉపసర్పంచ్ భగత్‌రెడ్డి, మండల వైద్యాధికారి లోహిత్ చెంగ్రాయన్, వైద్య, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



బంగారుపాళెంలో శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ వెంకటప్రసాద్

యాదమరిలో..

యాదమరి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష రెండోవిడత వైద్య సేవలను స్థానిక సర్పంచ్ రవి ప్రారంభించారు. అనంతరం యాదమరి ప్రభుత్వాస్పత్రి వైద్యులు పలువురు రోగులకు చికిత్స చేసి ఉచితంగా మందులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష రెండో విడతలో రోగులకు చికిత్స అందించనున్నట్లు వివరించారు. అలాగే దృష్టి లోపం ఉన్నవారి కోసం ఉచితంగా కంటి పరీక్షలు చేసి అద్దాలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



తవణంపల్లె: పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పూతలపట్టు: కిట్లు అందజేస్తున్న వైద్యాధికారులు

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండండి



గ్రామంలో పర్యటిస్తున్న ఎస్‌ఐ రాంభూపాల్

పూతలపట్టు: ఆన్‌లైన్‌లో లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని పూతలపట్టు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఎగువపాలకూరు హరిజనవాడలో పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో రుణాలు ఇస్తున్నట్లు ఆన్‌లైన్‌లో మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రజలు డబ్బు మీద ఆశతో వారు అడిగిన డాక్యుమెంట్లు, ప్రాసెసింగ్ ఫీజు చెల్లిస్తున్నారని అన్నారు. ఆ తరువాత వారు స్పందించలేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇస్తున్నట్లు తెలిపారు. రుణాలు కావాలంటే స్థానిక బ్యాంకు వారిని ఆశ్రయించాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం బైక్‌లు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.